క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల్సిందే..

నవాబుపేట: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. లింగంపల్లి, కారుకొండ, ఇప్పటూర్, కూచూర్, యన్మన్‌గండ్ల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్షుడు సదాశివుడు, ప్రధానకార్యదర్శి విజయ్ కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నట్లు పట్టణ ఏడీ అనంతయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

అడ్డాకుల: మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా మూసాపేట మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

దేవరకద్ర: మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పట్టణం, గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు లోకిరేవు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ రమేష్ తెలిపారు.

జడ్చర్ల: బాదేపల్లి సబ్‌స్టేషన్‌లో పరిధలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సరఫరా ఉండదని ఏడీఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ జ్ఞానసుందర్ తెలిపారు.

13న చెస్ పోటీలు

జడ్చర్ల టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని గీతాశ్రీ పాఠశాలలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళీకృష్ణ తెలియజేశారు. 5వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులతోపాటు సీనియర్స్ విభాగంలో 18ఏళ్లు నిండిన వారికి రెండు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనాలనుకున్న వారు 9440145404 నంబరులో సంప్రదించాలని కోరారు.

13న ప్రతిభా పురస్కారాల అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: సగర (ఉప్పర) సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న పట్టణంలో సగర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సమితి అధ్యక్షుడు బి.పర్వతాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొంటారని వివరించారు.

15 రోజుల జైలుశిక్ష

అడ్డాకుల: డ్రంకెన్ డ్రైవ్‌లో మహబూబ్‌నగర్ రూరల్ మండలం పోతన్‌పల్లి గ్రామానికి చెందిన బుడుగజంగం నర్సిములు ఇటీవల పట్టుబడినట్లు అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నిర్మల ఎదుట అతడిని శుక్రవారం హాజరుపర్చగా 15 రోజుల జైలుశిక్ష, రూ.4వేల జరిమానాను విధించారని వివరించారు.

మహబూబ్‌నగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురు ద్విచక్ర వాహనదారులను శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరిచినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు న్యాయమూర్తి డి.నిర్మల ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేలు, మరో ఇద్దరికి రూ.3వేలు, ఒకరికి రూ.2వేల జరిమానా విధించినట్లు వివరించారు.

చెత్త తొలగింపు

దేవరకద్ర: పంచాయతీ కార్మికులు సమ్మెను విరమించడంతో తిరిగి విధులకు హాజరు అయ్యారు. చెత్తను తొలగించే పనులు చేపట్టారు. గురు, శుక్రవారాలలో పట్టణంలోని పలు వీధుల్లో, వార్డులో చెత్తను తొలగించారు.

విద్యార్థికి అభినందన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ (2022–23) లో శిక్షణ పొందిన విద్యార్థి వి.కృష్ణచైతన్య ఇటీవల ఎస్‌ఐ (ఏఆర్)గా ఎంపికయ్యాడు. దీంతో శుక్రవారం ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వి.పాండుతో కలిసి కలెక్టర్ చాంబర్‌కు వచ్చాడు. ఈ మేరకు అతడిని జోగుళాంబ జోన్‌లో ఎస్‌ఐగా మొదటి స్థానంలో నిలిచినందుకు కలెక్టర్ రవినాయక్ అభినందించారు.

కులవృత్తిదారుల అభ్యున్నతే లక్ష్యం

కోయిల్‌కొండ: కులవృత్తిదారుల అభ్యున్నతే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లవల్లి, చంద్రాస్‌పల్లి, వింజామూర్ గ్రామాలలో గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గొల్లకురువలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ నిర్మలాదేవి, సింగిల్‌విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో కలలు సాకారం



బోదగుట్టతండాలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

రాజాపూర్: పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుండడంతో కలలు సాకారం అవుతున్నాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బాలానగర్ మండలంలోని బోడగుట్టతండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, సీసీరోడ్డును అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గిరిజనతండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. అదేవిధంగా ప్రత్యేక నిధులు కేటాయించడంతో తండాలకు బీటీరోడ్లు, తదితర సౌకర్యాలు కల్పించుకొని అభివృద్ధి చేసుకొంటున్నామని వివరించారు. మనతండా మనరాజ్యం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందని అన్నారు. బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలన్నారు. అనంతరం పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.కార్యక్రమంలో ఎంపీపీ కమల, జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రజిని, వైస్‌ఎంపీపీ వెంకటాచారీ, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అలసత్వం వీడాలి

రాజాపూర్: గ్రామాల్లో సమస్యలు నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అధికారులు అలసత్వం వీడాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ కమల అధ్యక్షతన జరిగిన బాలానగర్ మండల సర్వసభ్యసమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా ఉడిత్యాల, బాలానగర్‌లో మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని సర్పంచ్‌లు మల్లేష్, విజయలక్ష్మి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెద్దబాయి తండాకు బీటీరోడ్డు లేదని సర్పంచ్ తిరుపతి ఎమ్మెల్యేను కోరారు. విద్యుత్ సమస్యను అధికారులు పట్టించుకోవడం చిన్నరేవల్లి సర్పంచ్ లక్ష్మి అన్నారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జీసీసీ చెర్మన్ వాల్యానాయక్, వైస్ ఎంపీపీ వెంకటాచారి, ఎంపీడీఓ కృష్ణారావ్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 105 మంది ఎంపిక

జడ్చర్ల టౌన్: తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మ్యాజిక్ బష్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 9 కంపెనీలు పాల్గొనగా 218మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 105 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ తెలిపారు. ఇంగ్లీష్‌విభాగం అధిపతి రమాదేవి, అధ్యాపకులు భార్గవి, లత, అనిత, శ్రావణి పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులు

బాధ్యతలు స్వీకరించిన మెప్మా పీడీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మెప్మా రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) గా ఎంకేఐ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మెప్మా అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు అందజేసి లక్ష్యం చేరుకోవాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. అంతకుముందు ఆయనను డీఎంసీ శివకుమార్‌గౌడ్, సీఓలు ఆంజనేయులు, యాదయ్య, దేవమ్మ, వరలక్ష్మి, నిర్మల తదితరులు సన్మానించారు. అలీ ఇప్పటివరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని మెహిదీపట్నంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. ఇక సుమారు రెండున్నరేళ్ల పాటు మహబూబ్‌నగర్ మెప్మా ఇన్‌చార్జ్ పీడీగా మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ వ్యవహరించారు.



ఏడీ ఎంకేఐ అలీని సన్మానిస్తున్న మెప్మా అధికారులు, సిబ్బంది

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గృహలక్ష్మి పథకం అర్హులైన వారందరికీ వర్తింప చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జమీల్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో విఫలమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్, అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రశాంత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక విశ్వేశ్వరకాలనీ (వార్డు నం.10) లోని ఓ గల్లీలో నాలుగు రోజుల క్రితం మిషన్ భగీరథ పథకం పైపులైన్ పగిలింది. దీంతో తాగునీరు వృథాగా మట్టిరోడ్డుపై ఏరులై పారుతోంది. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువైపు నుంచి మర్లు రోడ్డుపైకి రావాలంటే బురదలో ఎక్కడ ఇరుక్కుపోతామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ వైష్ణవిని వివరణ కోరగా సంఘటన స్థలాన్ని పరిశీలించి వెంటనే బాగు చేయిస్తామన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాజాపూర్: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో రాజాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో బహుమతి సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ వడ్డన్న తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, హెచ్‌ఎం ఆనంద్ అభినందించారు.

తప్పిన ప్రమాదం

నవాబుపేట: దేపల్లి సర్పంచ్ లత భర్త శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి నవాబుపేటకు వస్తుండగా గద్దగుండు సమీపంలో ఆయన బ్రీజా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకు వెళ్లింది. వాహనం చాలా వరకు దెబ్బతినగా అందులో ఉన్నవారు పాక్షిక గాయాలతో బయటపడ్డారు.

మినీ ఇండోర్ స్టేడియం ప్రారంభించిన మంత్రి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో రూ.2కోట్ల 65లక్షలతో నిర్మించిన మినీ ఇండోర్ స్టేడియం శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఊర్మికకు అండగా ఉంటాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : గద్వాల జిల్లాకు చెందిచిన విద్యార్థి ఊర్మికకు అండగా ఉంటానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రెడ్ క్రాస్ విద్య నిధి ద్వారా రూ. 1.90 లక్షల చెక్కును అందజేశారు. ఎస్‌వీఎస్ మెడికల్‌కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఈమెను అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవి నాయక్, రెడ్ క్రాస్‌చైర్మన్ నటరాజ్ ఉన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



నవాబుపేట: మేరామట్టి మేర దేశ్‌లో భాగంగా గ్రామాల్లో 75 మొక్కలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో 75 ఆకారంలో 75 మొక్కలు నాటారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల ముగింపు నేపథ్యంలో కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఉపాధి ఏపీఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నరేష్, జంగమ్మ తదితరులు ఉన్నారు.

నాణ్యతతో నిర్మించాలి

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీలలో సీసీరోడ్లు నాణ్యతతో నిర్మించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శుక్రవారం చంద్రాస్‌పల్లిలో రోడ్డును, డ్రెయినేజీ నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

మాజీ జవాన్‌లకు సన్మానం

నవాబుపేట: ఇప్పటూర్‌లో 12 మంది మాజీ జవాన్‌లను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు యాదయ్య, శ్రీనివాస్, సూర్యప్రకాష్‌రావు, బీమయ్య, రాజేష్‌శర్మ, రఘు, భస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శికి...

స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ మూసా బావజీర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సీనియర్ నాయకుడు చంద్రకుమార్‌గౌడ్, నాయకులు అజ్మత్‌అలీ, లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబా, పీర్ సాధిక్, జహీర్, ఫైసల్, ఫక్రు, అజీజ్, మొయిజ్, ఫహీం, ఖాదర్, సల్మాన్, అబ్రార్, అంతయ్య పాల్గొన్నారు.

మినీ డీసీఎం పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొబ్బలి సాయికుమార్ శుక్రవారం తెల్లవారుజామున మినీ డీసీఎంలో కందూర్ స్టేజీ సమీపంలోని పెద్దవాగులో అక్రమంగా ఇసుకను నింపుకుని వెళ్తుండగా అక్కడే పట్టుకుని వాహనాన్ని ఠాణాకు తరలించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు నిరాహార దీక్ష

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ ప్రభుత్వరంగ సంస్థల ఈపీఎస్ పెన్షనర్ల విశ్రాంత ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదుట శనివారం నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు శుక్రవారం ఓ ప్రకటనలో వివరాలు పేర్కొన్నారు. జాతీయ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అశోక్‌రావత్ ఢిల్లీలో శాంతియుతంగా మౌన ప్రదర్శన నిర్వహిస్తుంటే అక్కడి పోలీసులు అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తూ దీక్ష చేపడుతున్నట్లు వివరించారు.

ఆర్థికసాయం

దేవరకద్ర రూరల్: డోకూర్‌కి చెందిన నరసింహా రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో 2003–04లో దేవరకద్రలోని బాలుర ఉన్నత పాఠశాలలో అతడితో పాటు చదివిన మిత్రులు బాధిత కుటుంబానికి సాయంగా నిలవాలనుకున్నారు. రూ. 20 వేలు, కిరాణా సామగ్రిని నరసింహ భార్యకు శుక్రవారం అందజేశారు.

చిన్నచూపు తగదు

కోయిల్‌కొండ: మండలంలోని నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం అందిస్తోన్న బీసీ బంధు ఎంపికలో చిన్నచూపు చూడడం తగదని సంఘం నాయకులు రామస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 12గ్రామపంచాయతీల్లో ఒక్కరికి కూడా ప్రకటించకపోవడంపై ప్రశ్నించారు. శ్రీనువాసులు, భరత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: ఆదివాసీల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నాయకులు అన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ లింగంనాయక్ శుక్రవారం జడ్చర్లలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం చేపడుతున్న చలో గాంధీ భవన్ విజయవంతం చేయాలని కోరారు. గిరిజన ఆదివాసీలకు కాంగ్రెస్ అండగా నిలబడిందని గుర్తు చేశారు. గంగ్యానాయక్, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



స్టేషన్ మహబూబ్‌నగర్: వాసవీ మహిళా కన్వెన్షన్‌కు రూ.2కోట్లు, వాసవీ విద్యార్థి వసతి గృహానికి రూ.25లక్షలు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటానికి ఆర్యవైశ్యులు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండ వెంకటేశ్వర్లు, మిర్యాల వేణుగోపాల్, మన్యంకొండ దేవస్థానం బోర్డు సభ్యులు ఎదిరె ప్రమోద్‌కుమార్, కొండ చక్రధర్‌గుప్త, శ్రీధర్, సువర్ణ, కలకొండ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజం భవన నిర్మాణానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రూ.30లక్షల నిధులు కేటాయిస్తానని ప్రకటించడం సంతోషంగా ఉందని సమాజ్ అధ్యక్షుడు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షుడు యశ్వంత్‌రావు నామాజీ, సలహాదారులు రాజు నామాజీ, సభ్యులు వసంతరావు, లక్ష్మణ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలు వినియోగించుకోవాలి

జడ్చర్ల టౌన్: ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా, మాతాశిశుసంరక్షణ అధికారి డా. శ్వేతారెడ్డి అన్నారు. గంగాపురం ఆరోగ్యకేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం గ్రామంలో పర్యటించి ఆరోగ్య పథకాలపై ఆరా తీశారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన ఆరోగ్య పథకాలపై ఏ మేరకు అవగాహన ఉందో తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి ఆరోగ్యం గురించి స్వయంగా వారినే అడిగారు. ఆరోగ్య పథకాలు అందరికి అందించాలని సిబ్బంది సూచనలు చేశారు. డ్రైడే నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సబ్‌యూనిట్ అధికారి రమేష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు శివకాంత్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీధర్‌రెడ్డి, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డా.శ్వేతారెడ్డి

ఆలయ పున:ప్రారంభంపై సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగామం అన్నాసాగర్‌లో ఆంజనేయ స్వామి ఆలయ పునఃప్రారంభం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దంపతులు సూచించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మాతృమూర్తి వరలక్ష్మమ్మ, సోదరుడు శశివర్ధన్‌రెడ్డి దంపతులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 17,18,19 తేదీల్లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామపెద్దలు కార్యక్రమాలను ముందుండి నడిపించాలని, ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు. వివిధ అంశాలపై గ్రామ పెద్దలతో చర్చించారు. గోపాల్‌శర్మ, సర్పంచ్ నీలిమ, ఎంపీటీసీ ఊష, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

అడ్డాకుల: మండల తహసీల్దార్‌గా ఘన్సీరాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆయన వనపర్తి జిల్లా చిన్నంబావి తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న కిషన్ వనపర్తి జిల్లా పెద్దమందడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఘన్సీరాం కందూర్‌కు వెళ్లి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా మూసాపేట తహసీల్దార్‌గా బ్రహ్మంగౌడ్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఇక్కడ పని చేస్తున్న మంజులను గద్వాల జిల్లాకు బదిలీ చేశారు.

సన్మానం..

మిడ్జిల్: మండల తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన రాజునాయక్‌ను శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు . ఎంపీపీ సుదర్శన్, నాయకులు బాలు, బాల్‌రెడ్డి, పాండుయాదవ్, భాస్కర్, లక్ష్మన్, వెంకట్‌రెడ్డి, భీమ్‌రాజ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: మండల తహసీల్దార్‌గా ఉన్న జ్యోతి ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం గండీడ్ తహసీల్దార్ కార్యాలయంలో ఆమెకు వీడ్కోలు పలికారు. ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ఇంతియా, ఎంఈఓ వెంకటయ్య, ఆర్ఐలు రాఘవేందర్, ఫహేద్, రుక్మిణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



లక్క పురుగులను నివారించండి

జడ్చర్ల: స్థానిక ఎర్రసత్యం కాలనీలో ఇళ్లలోకి సమీప గోదాముల నుంచి లక్క పురుగులు వచ్చి తమను ఇబ్బందుల పాలు చేస్తున్నాయని స్థానికులు శుక్రవారం జిల్లా గిడ్డంగుల శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. తమ ఇళ్లకు అతి సమీపంలో ప్రభుత్వ గోదాములు ఉన్నాయని, వాటిల్లో సరైన విధంగా రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో తమకు సమస్యగా మారిందన్నారు. మందులు పిచికారీ చేసి లక్క పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో గురుకుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ సులోచనకు వినతిపత్రం అందజేశామని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.రాజు, ప్రధాన కార్యదర్శి లింగం గౌడ్ తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో పంపిణీ చేయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

చెక్కులు అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం నుంచి 14 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన బొక్కలపల్లి రాజవర్ధన్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.60వేల చెక్కు మంజూరు కావడంతో దాన్ని శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందజేశారు. డీఈ నరేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ విలీనంపై హర్షం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న మజీద్ ఆవరణలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విలీనం చేయడంపై ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రహెమాన్ సోఫీ శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, మౌలానా మహ్మద్ ముబారక్, మహ్మద్ వసీం, వాజిద్, అలీ, రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

అమరులకు ఘననివాళి



మహబూబ్‌నగర్ రూరల్: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీ రావు, ఎస్సీ వర్గీకరణ పోరాట ఉద్యమంలో అమరులైన మాల పానంగి శేషయ్య, గొపతోటి నారాయణ, రెడ్డి సత్యనారాయణ, సుదర్శన్‌లను స్మరించుకుంటూ శుక్రవారం నాయకులు నివాళులు అర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం వారు ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. రాష్ట్ర కోఆర్డినేటర్ కర్ణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చలపతి పాల్గొన్నారు.

2906 దరఖాస్తులు

మిడ్జిల్: మండలంలో గృహలక్ష్మి పథకం కోసం 2906 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. అత్యధికంగా మిడ్జిల్‌లో 413, అతి తక్కువగా చౌటకుంటతండాలో 17 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లకు 450..

మిడ్జిల్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇస్తుండడంతో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తులు స్వీకరించారు. కాగా 450 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీపీ సుదర్శన్ తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.